# దేశవ్యాపిత రైతుల 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం




**కిసాన్ ముక్తి సంసద్‌లో ప్రసంగిస్తున్న కామ్రేడ్ ఝాన్సీ; వేదికపై ఇతర రైతుసంఘాల నాయకులు**

**న్యూఢిల్లీ, 20-11-17 :**

వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్వామినాధన్ కమీషన్ సిఫార్సు చేసిన విధంగా పంటల ఉత్పాదక ఖర్చుకు 50 శాతం కలిపి గిట్టుబాటు ధర ఇవ్వాలని; వ్యవస్థీకృత శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పరచి రైతులను తక్షణ రుణభారం నుండి విముక్తి చేయటమేగాక మరల రుణభారంలో కూరుకుపోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాపితంగా వివిధ రైతుసంఘాల సంయుక్త ఐక్య కార్యాచరణతో ఏర్పడిన 'ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ కో-ఆర్డినేషన్ కమిటి (ఏఐకెఎస్‌సిసి) గత మూడు నెలలుగా దేశవ్యాపితంగా వివిధ కార్యక్రమాలు, రైతు యాత్రలు నిర్వహిస్తూ వస్తోంది. సెప్టెంబర్ 17న విజయవాడలో ఏఐకెఎస్‌సిసి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించింది.

2017 నవంబర్ 20న ఏఐకెఎస్‌సిసి ఇచ్చిన 'ఛలో ఢిల్లీ' పిలుపుకు సంఘీభావంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) భాగస్వామిగా వున్న ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్‌కిసాన్‌సంఘ్ (ఏఐకెఎమ్‌కెఎస్) ఈ కార్యక్రమంలో పాల్గొంది. ఆంధ్రప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాలనుండి ఏఐకెఎమ్‌కెఎస్ ప్రతినిధులు హాజరయ్యారు.

దేశ వ్యాపితంగా దాదాపు 184 రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ వీధులలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వేలాది రైతాంగం ప్రదర్శనలు నిర్వహించారు. 'కిసాన్ ముక్తి సదన్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.

ఏఐకెఎమ్‌కెఎస్ కో-కన్వీనర్ కా॥ యస్. ఝాన్సీ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐకెఎస్‌సిసి ఆధ్వర్యంలో జరుగుతున్న కృషిని అభినందించారు. దేశంలో, రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన పాలకులంతా సామ్రాజ్యవాద, భూస్వామ్యవర్గాల ప్రయోజనాలను నెరవేర్చే విధానాలను అనుసరిస్తూ వస్తున్నారని, దేశంలోని కీలకమైన వ్యవసాయ, పారిశ్రామికరంగాలను సామ్రాజ్యవాదుల పరం చేయటమే నేటి వ్యవసాయ, రైతాంగ సంక్షోభానికి కారణమన్నారు. ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యుటిఓ), ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఇపి) వంటి సంస్థలలో భాగస్వాములౌతూ దేశ రైతాంగ, ప్రజల ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీస్తున్నా రన్నారు. విత్తనాల ధరలు, ఎరువు - పురుగుమందుల ధరలు హెచ్చింపుచేస్తూ ఉత్పాదక ధరలను పెంచివేస్తూ, మరోవైపున న్యాయమైన ధరలు కల్పించకుండా రైతాంగాన్ని రుణభారంలో కూరుకుపోయేట్లు చేస్తున్నారని, రైతాంగ ఆత్మహత్యలకు ఇదే కారణమన్నారు. వ్యవసాయరంగంలో సామ్రాజ్యవాద దోపిడీ, చౌరబాటుకు వ్యతిరేకంగా పోరాడకుండా రైతాంగ ఆత్మహత్యలు, గిట్టుబాటు ధరల సమస్య పరిష్కారం కాదని చెబుతూ, ఈ దిశగా అందరమూ కలిసి పోరాటమార్గాన సాగాలని ఆమె పిలుపునిచ్చారు.

2018 జనవరి 26న కిసాన్ ముక్తి దివస్‌గా జరపాలని, దీనికి ముందుగా దేశవ్యాపితంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఏఐకెస్‌సిసి పిలుపు నిచ్చింది.

ooooo